ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





జీపీఎఫ్ వడ్డీ చెల్లించేదెప్పుడు..?

- జిల్లాలో పేరుకుపోయిన రూ. 30 కోట్లు
- భవిష్యనిధి రుణం మంజూరుకూ అడ్డంకి
- జిల్లాలో 200 దరఖాస్తులు పెండింగ్
- ప్రభుత్వాల వైఖరితో ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

మంచిర్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ భవిష్యత్తు అవసరాల కోసం మూల వేతనం నుంచి దాచుకున్న డబ్బు, అత్యవసర సమయంలో చేతికి అందకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే నుంచి 6 శాతానికి తగ్గకుండా తమ తమ ఖాతాల్లో జీపీఎఫ్ (జనరల్ ప్రావిడెంట్ ఫండ్) ప్రతి నెల జమ చేస్తారు. అలా జమ చేసిన మొత్తానికి ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 7 నుంచి 8 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఈ వడ్డీని ఉద్యోగ, ఉపాధ్యాయుల మూల వేతనం నుంచి మినహాయించిన మొత్తానికి జమ చేయాల్సి ఉంటుంది.

కనీసం 15 సంవత్సరాల సర్వీసు నిండిన ఉద్యోగి తాను దాచుకున్న మూల ధనం నుంచి 75 శాతం మేర రుణాలు, పాక్షిక ఉప సంహరణ ద్వారా తిరిగి పొందుదుకు వెసులు బాటు ఉంటుంది. రుణాలు పొందిన పక్షంలో నెలసరి వాయిదా ప్రకారం తిరిగి చెల్లించాల్సి ఉండగా, పాక్షిక ఉపసంహరణ ద్వా రా పొందిన మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. అలా ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతా ల్లో నిలువ ఉన్న మొత్తం మూల ధనం వారి భవిష్య త్ అవసరాల నిమిత్తం ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 6 శాతానికి తగ్గకుండా మినహాయిం పులు చేస్తోంది.

జిల్లాలో రూ. 30 కోట్లు పెండింగ్....

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల మూల వేతనం నుంచి మినహాయించిన మొత్తానికి 2009-10 నుంచి ప్రభుత్వాలు వడ్డీ చెల్లించడం లేదు. జిల్లాలో రెండు వేల పై చిలుకు జీపీఎఫ్ ఖాతాలు కలిగిన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉండగా, వడ్డీ కింద ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం సుమారు రూ. 30 కోట్లు పెండింగులో ఉంది. ఉద్యోగులకు రావాలసిన వడ్డీ రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించకపోవడంతో రుణాల మంజూరులో ప్రభావం చూపుతోంది. ఉద్యోగి దాచుకున్న మొత్తం నుంచి 75 శాతం రుణాలు, పాక్షిక ఉపసంహరణల ద్వారా ప్రభుత్వాలు తిరిగి చెల్లించాల్సి ఉంది. అయితే దశాబ్దాల కాలంగా రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ జమ చేయకపోవడంతో 50 శాతానికి మించకుండా చెల్లింపులు జరుగుతున్నాయి. అవి కూడా రెండేళ్లుగా నిలిచిపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా అత్యవసర సమయాల్లో ఉపయోగపడాల్సిన భవిష్యనిధి నిరుపయోగంగా మారుతోంది. జిల్లాలో రెండేళ్లుగా ఆ 50 శాతం రుణాలు కూడా చెల్లింపులు జరగడం లేదు. ప్రభుత్వాలు వడ్డీ చెల్లించని కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేసిన మొత్తం నుంచి రుణాలు కూడా సకాలంలో పొందలేని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులు 200 పై చిలుకు పెండింగులో ఉన్నాయి. దాదాపు 8 కోట్ల వరకు దరఖాస్తు దారులకు రుణాల మొత్తం విడుదల కావలసి ఉంది. కేవలం ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరితో వడ్డీ చెల్లించని కారణంగా తాము దాచుకున్న భవిష్యనిధి నుంచి సైతం సకాలంలో రుణాలు పొందలేని స్థితిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కొట్టుమిట్టాడుతున్నారు.

మిగతా 7లో

తక్షణమే నిధులు చెల్లించాలి..

పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరినేని గంగాధర్



ఉద్యోగులు దాచుకున్న భవిష్య నిధి నుంచి అవసరం ఉన్నప్పుడు నగదు తీసుకునే వెసులుబాటు కల్పించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు దాపురించాయి. రుణాల మంజూరు విషయం ప్రభుత్వం చెల్లించే వడ్డీ డబ్బులతో ముడిపడి ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ మే జీపీఎఫ్ లకు సంబంధించిన వడ్డీ డబ్బు ల నిధులను జిల్లా పరిషత్ లకు చెల్లించడం ద్వారా సకాలంలో రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలి.



పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు



కుందారంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రావు

జైపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుందారం గ్రామంలో పర్యటించారు. వాడ వాడలు తిరుగుతూ గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్డు పక్కన, షాపుల ముందు ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతి రోజు తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. షాపుల యాజమానులు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను రోడ్డు పక్కన పడేయవద్దని, చెత్తకుండీలు వాడాలని సూచించారు.

సెగ్రిగేషన్ షెడ్డులో కంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. స్మశాన వాటికను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను సంరక్షించాలని, తాగునీటి వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించి శుద్ధమైన నీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తని ఖీ చేశారు. ఆయన వెంట ఎంపీవో శ్రీపతి బాపురావు, సిబ్బంది ఉన్నారు.

ముల్కల్ల ఎస్సీ గురుకులాల్లో న్యాయ సేవ సదస్సు

హాజీపూర్, జూలై5 (ఆంధ్రజ్యోతి): ముల్కల్ల ఎస్సీ బాలుర గురుకులంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలను కూడ తెలుసుకొని ఉండాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్‌డిఫెన్స్ కౌన్సిల్ ఎండీ సంధాని అన్నారు. న్యాయసేవా అధికార సంస్థ మంచిర్యాల జిల్లా సభ్యులందరూ బీఎన్ఎస్ సెక్షన్ల గురించి పోక్సో చట్టాలపై ఇటీవల మారుతున్న చట్టాల గురించి విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు నాగేశ్, ప్రమోద్, సంతోష్‌గౌడ్‌లు పాల్గొన్నారు

వేతనాలు ఇప్పించండి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వెంటనే వేతనాలు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని నాలుగో తరగతి ఉద్యోగులు ఎస్సీ కార్పొరేషన్ డీడీకి శనివారం వినతిపత్రం అందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన దుర్గా ప్రసాద్‌ను నాలుగో తరగతి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు మోతె పోచయ్య, జిల్లా అధ్యక్షుడు రాంటెంకి లక్ష్మణ్, శంకర్, సునీత, విమల, కిరణ్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

చెన్నూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు నియోజకవర్గంలో ఆదివారం కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కోటపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత, ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్‌వోఆర్ ప్లాంటు ప్రారంభం, చెన్నూరు క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్, బస్టాండ్‌లో నూతన బస్సులను ప్రారంభిస్తామని తెలిపారు.

చెట్ల తొలగింపునకు వేలం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్ కరీంనగర్ చాందా రోడ్డు 251/9 నుంచి 255/7కిలో మీటర్ల (మంచిర్యాల ఐబీ నుంచి శ్రీనివాసగార్డెన్) వరకు రోడ్డు వెడల్పులో భాగంగా ఇరువైపులా ఉన్న 63 చెట్లను తొలగించేందుకు వేలం పాట నిర్వహిస్తున్నామని రహదారులు భవనాల శాఖ కార్య నిర్వాహక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలి పారు. ఆసక్తి గల వారు ఈ నెల 12వ తేదీన సాయంత్రం 4 గంటలకు నస్పూర్‌లోని సమీకృత కార్యాలయాల భవనాల సము దాయంలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

మంత్రిని విమర్శిస్తే సహించేది లేదు

మందమర్రిటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గండె రాంచందర్, ఒడ్నాల కొమురయ్య తెలిపారు. శనివారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోటపల్లిలో 200 కోట్లతో ఇంటి గ్రేటెడ్ పాఠశాల పనులు కొనసాగుతున్నది కనబడడం లేదా అన్నారు. క్యాతనపల్లిలో రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారన్నారు. నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. నాయకులు కమల్ మనోహర్‌రావు, రాజయ్య ఉన్నారు

అంకితభావంతో పనిచేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్‌లు, రికార్డులను, హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు పని చేస్తాయన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. విధుల పట్ల బాధ్యతగా వ్యహరించాలని, కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తులో ఈవీఎంలు

జిల్లాలోని నస్పూర్‌లో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా ల గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ఈవీఎం గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రత చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం గోదాము వద్ద పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఇంటింటి ఎన్‌రోల్‌మెంట్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలకు, సూపర్ వైజర్‌లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏండ్ల వయస్సు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని, మార్పులు, చేర్పులు, మరణించిన వ్యక్తుల పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల తహసీ ల్దార్, ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్ వరలక్ష్మీ, మంచిర్యాల నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సంజీవ్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతోనే సమాజంలో గుర్తింపు

రౌడీషీటర్ల కౌన్సెలింగ్‌లో ఏసీపీ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రిటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సత్ప్రవర్తతోనే సమా జంలో మంచి గుర్తింపు లభిస్తుందని తద్వారా వారి కుటుంబాలకు కూడా మంచి పేరు లభిస్తుందని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ తెలిసో తెలియక చాలా మంది నేరాలు చేస్తుంటారని తప్పులు తెలుసుకుని నేర వృత్తి నుంచి బయటకు రావాలన్నారు.

సమాజంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పదే పదే పాల్పడే వారిపై రౌడీషీట్లు నమోదవుతాయన్నారు. మందమర్రి సర్కిల్ పరిధిలో రౌడీషీట్ నమోదైన వారిపై ప్ర త్యేక నిఘా ఉంటుందన్నారు. సంఘంలో రౌడీషీటర్లపై మంచి అభి ప్రాయం ఉండదని, కుటుంబాలు కూడా ఇబ్బందులు పడతాయ న్నారు. ప్రస్తుతం నేర వృత్తికి దూరంగా ఉంటూ పనులు చేసుకునే వారి గురించి తమ పై అధికారులకు తెలియజేసి రౌడీషీట్ తొలగించాలని సిఫారసు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న వాచ్‌మెన్లు, కుక్‌లు, స్లీపర్, స్కావెంజర్లకు ఏడు నెలలుగా పెండింగ్‌లో వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. బ్రహ్మానందం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో దళిత అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్. దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల వల్ల కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. దీనివల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వృత్తి పన్ను, టీడీఎస్ కట్టకుండా బిల్లులు పెట్టడం వల్ల ట్రెజరీలో ఆగిపోతున్నాయన్నారు. ఈ-కుబేర్, ఫ్రీజింగ్ అటూ పెండింగ్‌లో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ఈ విధానాన్ని మార్చి కలెక్టర్ ఖాతా నుంచి వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయనవిజ్ఞప్తి చేశారు.

రెండు సంతలతో నష్టమే
లక్షెట్టిపేట మున్సిపాలిటీలో ఒకే సంత ఉండాలని డిమాండ్ 7

ఆశావహుల చూపు
రిజర్వేషన్లవైపు 6

మూడో ప్లాంటు ఏర్పాటుకు అధికారులు సిద్ధంగా ఉండాలి

జైపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో మూడో ప్లాంటు ఏర్పాటుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సింగరేణి డైరె క్టర్ సత్య నారాయణరావు పేర్కొన్నారు. శనివారం జైపూర్‌లోని ఎస్టీపీపీ పరిపా లన భవనంలోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్లాంట్ విస్తరణలో భాగంగా ఏర్పాటు చేయ బోయే ప్లాంటు పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలోగా మూడో యూనిట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరు సమన్వయంతో ప్లాంటు ఏర్పాటులో భాగస్వాములు కావాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం సింగరేణి ఉద్యోగి, ఉత్తమ జ్యోతిష్య జాతీయ ప్రతిభ రత్న బంగారు నంది అవార్డు గ్రహీత డాక్టర్ ధూళిపాళ్ల మల్లి కార్జున శర్మను ఘనంగా సన్మానించారు. అనంతరం సింగ రేణి సంస్థ సీఎండీ బలరాం థర్మల్, సోలార్ ప్లాంట్ల విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకతపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్, ఎస్టీపీపీ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, అధికారులు నరసింహారావు, జేఎన్ సింగ్, సంతోష్‌కుమార్, మురళీధర్, మదన్ మోహన్, కిరణ్‌బాబు, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీపీపీ సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు

రాష్ట్రంలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే

జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్



హైదరాబాద్ బీజేపీ కార్యాలయం వద్ద సంబురాలు నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్

మందమర్రి, జూలై5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో రాబోయేది డబుల్ ఇంజిన్ సర్కారే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావు నేతృత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలు క్లీన్‌చీప్ చేస్తామని బీజేపీ జిల్లా ప్రదాన కార్యదర్శి, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం అశోక్ తెలిపారు. శనివారం బీజేపీ నూతన అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం వద్ద సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాతో పాటు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అన్నివార్గాల పార్టీ నాయకులు తరలివెళ్లామని తెలిపారు. అనంతరం అధ్యక్షుడికి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించారు.

రుణాలను సక్రమంగా చెల్లించాలి

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలు రుణాలు సక్రమంగా చెల్లిస్తే మరిన్ని సౌకర్యాలు సమకూరుతాయని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మంచిర్యాల రీజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్ అన్నారు. సీతారాంపల్లి, సింగాపూర్ శాఖల పరిధిలో 48 కోట్ల రుణాలు మహిళా సంఘాలకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వాటి చెల్లింపులు, పుస్తకాల నిర్వహణ, అంతర్గత రుణ చెల్లింపుల పనితీరు ఆధారంగా మరింత వెసులుబాటు కలుగుతుందన్నారు. సక్రమంగా చెల్లింపులు చేపట్టే వారికి 50 వేల వరకు అదనపు రుణాలు ఇస్తామని తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన, చిన్న మొత్తాల పొదుపునకు తగినంత డబ్బు చెల్లిస్తే బీమా, పెన్షన్, ఆర్థిక ప్రయోజన సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీజీబీ సీతారాంపల్లి, సింగాపూర్ శాఖల మేనేజర్లు నరసింహ స్వామి, రాము, ఫీల్డ్ ఆఫీసర్లు రవి, డేవిడ్, మెప్మా టీఎంసీ నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం దాముక ప్రభుదాస్



యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణానికి చెందిన తడక దినేష్(27) అనే యువకుడు శుక్రవారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దినేష్ తల్లిదండ్రులు తడక రవి, పద్మవతిలు గత రెండు నెలల క్రితం అమెరికాలో ఉంటున్న తన కూతురి ఇంటికి వెళ్లారు. అప్పటి నుంచి దినేష్ మంచిర్యాల పట్టణంలోని అమ్మ గార్డెన్‌లో నివాసముంటున్నాడు. శుక్రవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం ఇంటి సమీపంలో వారు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

మద్యానికి బానిసై ఒకరు..


మంచిర్యాలక్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గాంధీనగర్‌కు చెందిన పల్లపు వెంకటేశ్(42) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు ఎఎస్‌ఐ దివాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కూలీ పని చేసుకుంటున్న వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగుతూ భార్యతో గొడవ పడడంతో తాగుడు బంద్ చేయాలని మందలించింది. శుక్రవారం ఎఫ్‌సీఐ గోదాం వెనుకాల మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. తమ్ముడు శ్రీనివాస్‌కు ఫోన్ చేయడంతో వెళ్లి చూడగా అప్పటికే వెంకటేశ్ అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చోరీకి గురైన సామగ్రి లభ్యం

బెల్లంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలగురిజాల గ్రామంలో రైతు వేదికలో గురువారం చోరీకి గురైన సామగ్రి శనివారం లభ్యమైంది. గురువారం మూడు లక్షల విలువగల సీపీయు, వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లు చోరీకి గురైన విషయం తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్న సమయంలో శనివారం ఉదయం రైతు వేదిక ముందు దొంగిలించిన సామగ్రి పడి ఉంది. వ్యవసాయాధికారి రైతు వేదికకు విధులు నిర్వహించడానికి వచ్చిన సమయంలో సామగ్రి ఉండడంతో పోలీసులకు, వ్యవసాయ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. సీఐ అఫ్జలొద్దీన్, ఎస్‌ఐ రమేశ్‌తో పాటు జిల్లా వ్యవసాధికారి కల్పన రైతు వేదిక వద్దకు వచ్చి పరిశీలించారు. దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి ఎవరైనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశావహుల చూపు
రిజర్వేషన్ల వైపు

● పల్లెల్లో స్థానిక ఎన్నికలపై చర్చ



జిల్లాలో మొత్తం ఓటర్లు	3,48,368
మహిళలు	1,74,297
పురుషులు	174055
ఇతరులు	16
జిల్లాలో మొత్తం మండలాలు	15
గ్రామపంచాయతీలు	334
జడ్పీటీసీ స్థానాలు	15
ఎంపీపీలు	15
ఎంపీటీసీ స్థానాలు	123

బెజ్జూరు/కాగజ్‌నగర్‌టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వయంత్రాంగం సన్నద్ధమవుతుండటంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం మారుతోంది. గతంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు కలిపి 50శాతం వరకు ఉండేవి. ఈ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్ ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రిజర్వేషన్లు ఏ విధంగా ఖరారు చేస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఆశావహులు మాత్రం ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తమవుతూ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రధానంగా యువత ఈ సారి స్థానిక సంస్థల బరిలో ఉండేందుకు ఉవ్విళ్లూరుతోంది.

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం..

పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు పంచాయతీరాజ్ చట్టం 2018ప్రకారం గతంలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. దీని ప్రకారం వరుసగా రెండు దఫాలు ఒకేలా రిజర్వేషన్ అమలు చేసేలా చట్టం చేశారు. గత ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని సవరిస్తూ గత డిసెంబరులో జరిగిన శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణ చేసింది. ఈచట్ట సవరణ బిల్లు-2024కు అసెంబ్లీ ఆమోదం లభించింది. దీని ప్రకారం స్థానిక సంస్థల్లో ఒకే దఫా మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది. దీంతో ఈసారి మళ్లీ అన్ని స్థానాలకు రిజర్వేషను పూర్తిగా మారనున్నాయి. త్వరలో జరిగే ఎన్నికల్లో కొత్తగా రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతమున్న రిజర్వేషన్ మారుతుందా? కొత్త రిజర్వేషన్ వస్తే ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారనే విషయమై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

మద్దతుపై దృష్టి..

మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని, 30రోజుల్లో వార్డుల విభజన పూర్తి చేయాలని హైకోర్టు ఇటీవల ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో స్థానిక రాజకీయాలపై ఆసక్తి ఉన్న ఆశావహులు, ప్రధాన పార్టీల మద్దతుపై దృష్టి సారించారు. మూడు నెలల్లోగా స్థానిక ఎన్నికలు పూర్తి చేయాల్సిందేనని హైకోర్టు చెప్పడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. గ్రామాల్లో నలుగురు ఉన్నచోట రిజర్వేషన్లు ఏ విధంగా ఉంటాయో, తమకు అనుకూలంగా ఉంటుందో లేదోనని చర్చించుకుంటున్నారు. స్థానిక సమరం ఇప్పటికే ఆలస్యం కావడం. ప్రభుత్వం కూడా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కావడంతో ఆశావహులు సైతం తమ మద్దతుదారులను ఇప్పటి నుంచే మచ్చిక చేసుకుంటున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

కాసిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. శనివారం కాసిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మామిడిగూడలో కార్డన్‌సర్చ్ నిర్వహించి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు ల బాధ్యత కాబట్టి శాంతిభద్రతల పరిరక్షణ కోసమే గ్రామాల్లో కమ్యూనిటి కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. స్థానికులు, కొత్త వ్యక్తులు గ్రామాల్లోకి వచ్చినప్పుడు ఎవరూ కూడ ఆశ్రయం ఇవ్వరాదు. ఎవరైన అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు, మోసగాల్లు ఫోన్‌కాల్స్ మెసేజ్‌లకు వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. వాహనదారులందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామంలో ఎవరైన గుడుంబా తయారు చేసిన అమ్మిన కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం వాహనపత్రాలు లేని 25బైక్‌లను అదుపులోకి తీసుకొని మూడు బైక్‌లను సీజ్ చేశారు. గుడుంబా అమ్ముతున్న వ్యక్తి వద్ద రెండున్నర లీటర్ల గుడుంబా స్వాధీనం పరుచుకొని ఎక్సయిజ్‌వారు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రెండు బెల్ట్‌షాపుల్లో లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, దేవాపూర్, కాసిపేట ఎస్‌ఐలు అంజనేయులు, ప్రవీణ్‌కుమార్, ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో రాయితీ కంది విత్తనాలు



మాట్లాడుతున్న ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య

కాసిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రాయితీపై కంది విత్తనాలను తీసుకోవాలని ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, సింగిల్ విండో చైర్మన్ నీలా రాంచందర్ అన్నారు. శనివారం ముత్యంపల్లి రైతు వేదికలో వారు మాట్లాడుతూ జాతీయ ఆహారభద్రత పథకం కింద రైతు లకు రాయితీపై కంది విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. పత్తిలో అం తర్‌పంటగా పప్పు దినుసులను వేసుకోనే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. కాబట్టి రైతులందరూ పత్తిలో అంతర్‌పంటగా పప్పు దినుసులను వేడుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు రాయితీపై కంది విత్త నాలను అందజేశారు. వ్యవసాయ అధికారి ప్రభాకర్, ఏఈవోలు శ్రీధర్, ప్రతిభ, ఆత్మ మెంబర్ శ్రీనివాస్, ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఈ ఉత్తమ్‌కుమార్

హాజీపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ ఉత్తమ్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని దొనబండ గ్రామంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ ఉత్తమ్‌జాడే మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల పట్ల అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్‌కు సంబంధించిన పనులు చేయకూడదని వివరించారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను గుర్తించి సిబ్బందికి తెలియజేయాలన్నారు. టోల్ ఫ్రీనెంబర్ 192 ద్వారా ప్రతి సమస్యపై ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పశువుల యజమానులు మేతకు వెళ్లేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గరకు వెళ్లకుండ జాగ్రత్త వహించాలని సూచించారు. విద్యుత్ కంచెల వల్ల రైతులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఎవరైన విద్యుత్ కంచే ఏర్పాటు చేస్తే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎండీ కైజర్, ఏఈ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బెల్లంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగాం శ్రీకాంత్ అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నిరసన చేపట్టి మాట్లాడారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ దాదాపు 8వేల కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని దీంతో ఎంతో మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కళాశాల యజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు అందజేస్తామని విద్యార్థులతో చెప్పడంతో ఉన్నత చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవికాంత్, విజయ్‌సాయి, సాయి కుమార్‌లు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

మొదటి త్రైమాసికంలో 99 శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి 99 శాతం, రవాణాలో 100 శాతం సాధించడంపై సీఎండీ ఎన్. బలరాం హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏప్రిల్ మాసం నుంచి జూన్ వరకు 160 లక్షల టన్నుల లక్ష్యం కాగా, 159.9 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసిందని, 160 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసేందుకు నిర్ణయించగా, 166 లక్షల టన్నులు వినియోగదారులకు అందించినట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఓసీపీలలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూలై నెలలో రోజుకు 2.15 లక్షల టన్నుల రవాణా, 1.80 లక్షల టన్నుల బొగ్గును వెలికితీయాలని ఆదేశించారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాకులో ఉత్పత్తి అవుతున్న బొగ్గును సమీపంలోని చండీపడా రైల్వే సైడింగ్‌కు రవాణా చేసేందుకు, సింగరేణి నుంచి వినియోగదారులకు నాణ్యమైన గ్రేడ్ బొగ్గును అందించేందుకు సీహెచ్‌పీలలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఈడీ(కోల్ మూమెంట్) సుభానీ, అడ్వైజర్(ఫారెస్ట్రీ) మోహన్ పరిగెన్, జీఎం(సీపీపీ) మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శ్రీరాంపూర్ ఓసీపీ నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకుడు సుంకే రవి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి అమలు చేయాలని చూస్తే కార్మికవర్గం ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలని కోరారు. సమ్మె విజయవంతం చేయడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్టు మహేందర్, రాజేశ్, సంపత్, సురేష్, సతీష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతోనే హక్కుల సాధన సాధ్యం



కేకే 5 గనిపై నినాదాలు చేస్తున్న కార్మిక జేఏసీ నాయకులు

మందమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సమ్మెతోనే ఉద్యోగుల హక్కుల సాధన సాధ్యమని అఖిలపక్ష కార్మిక జేఏసీ నాయకులు ముస్కే సమ్మయ్య, నాగరాజు గోపాల్, రాంశెట్టి నరేందర్, ఎస్. వెంకటస్వామి, బడికెల సంపత్ అన్నారు. ఏరియాలోని కేకే5గని వద్ద శనివారం నిర్వహించిన సమ్మె గేటు మీటింగ్‌లో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అన్నివర్గాల ప్రజ ల పాలిట శాపంగా మారాయని చెప్పారు. బ్రిటీష్‌కాలం నాటి చట్టాలను సైతం నాలుగు కోడ్‌లుగా మార్చాడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నాలుగు కోడ్‌లుగా మార్చడమంటే సింగరేణిలో కార్మిక సంఘాలు లేకుండా చేయడంతో పాటు పరిశ్రమలను పూర్తిగా ప్రయివేటు పరం చేయడమే అన్నారు. కేంద్ర విధానాలపై దేశవ్యాప్తంగా ప్రజలు నిరసనలకు సిద్ధంగా ఉన్నారని ఈనెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సలేంద్ర సత్యనారాయణ, కంది శ్రీనివాస్, భీమనాథుని సుదర్శన్, గాండ్ల సంపత్, మిట్ట సూర్యనారాయణ, అల్లీ రాజేందర్, ఆదర్శ్, వీరారెడ్డి పోలు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దూరంగా ఉండాలి

మందమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలు ఈ నెల 9న తలపెట్టిన సమ్మెకు సింగరేణి ఉద్యోగులు దూరంగా ఉండాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. స్థానికంగా శనివారం జీఎం విలేకరులతో మాట్లాడారు. ఈ సమ్మెకు సింగరేణి కార్మికులకు ఎలాంటి సంబంధం లేదనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి ఓవర్‌బర్డెన్ తొలగింపులో కొంత వెనుకబడి ఉన్నామని చెప్పారు. ఈ జూలై, ఆగస్టు నెలలో వర్షాభావం వల్ల ఓపెన్‌కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఇలాంటి సమయంలో సమ్మె చేస్తే ఏరియాపై ప్రభావం పడుతుందని చెప్పారు. విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలుగుతుందన్నారు. సమ్మెతో సంస్థకు రూ. 76కోట్లు నష్టం వాటిల్లుతుందన్నారు. ఉద్యోగులు రూ. 13.7కోట్ల వేతనాలు నష్టపోతారని తెలిపారు. వాస్తవాలను గ్రహించి ఉద్యోగులు ఈ సమ్మెను వ్యతిరేకించాలని జీఎం కోరారు.

సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె కరపత్రాలు అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

బెల్లంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. శాంతిఖనిగని లాంగ్‌వాల్ ప్రాజెక్టు మైన్ మీటింగ్‌లో శనివారం మాట్లాడారు. అనంతరం సమ్మెకు సంబంధించిన ఆవిష్కరించి కార్మికులకు అందజేశారు. ఏఐటీయుసీ నాయకులు సివిల్ సప్లై గోదాములో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, చాంద్‌పాషా, మణిరాం సింగ్, రాజన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రెండో గని పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగరేణి జేఏసీ నాయకులు నర్సయ్య, వెంకటేశ్, క్రిష్ణచారి, ప్రదీప్, శ్రీనివాస్, సాగర్, జాహీద్, రవి, రమేశ్, బార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెపోస్టర్లను వివిధ సంఘాల నాయకులు శనివారం కేఎల్ మహేంద్ర భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ నాయకులు తిరుపతి, బూర శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకోం

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాలకులు కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఆర్కే-5, సీహెచ్‌పీలలో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పలువురు మాట్లాడారు. దేశవ్యాప్తంగా జూన్ 9న చేపట్టే సమ్మెలో అన్ని గనులు, విభాగాల నుంచి వేలాదిగా తరలివచ్చి తమ సత్తా చాటాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బద్రి బుచ్చయ్య, చంద్రమోహన్, ప్రసాద్ రెడ్డి, నర్సింగ్ రావు, ఐఎన్‌టీయూసీ నాయకులు శంకర్ రావు, గరిగె స్వామి, మల్లారెడ్డి, నంబయ్య, సీఐటీయూ నాయకులు తుమ్మల రాజారెడ్డి, గుల్ల బాలాజీ, మేడిపల్లి శ్రీనివాస్, లక్ష్మణ్, టీబీజీకేఎస్ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బండి రమేష్, పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొనాలి

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 9వ తేదీన నిర్వహించే సమ్మెలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ కాంట్రాక్ట్ కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడారు. కేంద్రం విధానాలతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అన్ని కార్మిక సంఘాలు దీన్ని వ్యతిరేకిస్తూ సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కాతరాజు ప్రభాకర్, భోగి మనోజ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో యాజమాన్య కోటాకు కౌన్సెలింగ్



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పిన్సిపాల్ శ్రీనివాసరావు

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్‌లో 150 యాజమాన్య సీట్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 84 సీటు భర్తీ అయ్యాయి. మిగిలిన 66 సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సీట్లు పొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్, బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం. దేవేందర్, మైనింగ్ హెచ్‌డీ నరసింహస్వామి ధృవీకరణ పత్రాలు అందించారు. మిగిలిన 66 సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగం అధిపతి రవీందర్, మెకానికల్ విభాగం అధిపతి దామోదర్, సివిల్ విభాగం అధిపతి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకుడు సారయ్య

శ్రీరాంపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని హెచ్ఎంఎస్ కేంద్ర నాయకుడు తిప్పారపు సారయ్య కోరారు. ఎస్ఆర్‌పీ 1 గనిపై శనివా రం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిప్పారపు సారయ్య మాట్లాడుతూ కొత్తగా వచ్చే లేబర్ కోడ్లతో కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందని చెప్పారు., యాజమాన్యాలు ఇష్టారా జ్యంగా వ్యవహరించే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగా లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. 50 కోట్ల మంది కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే చట్టాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్, పిట్ కార్యదర్శి రేగుంట సందీప్, ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం, మేకల రాములు, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు సమ్ము రాజయ్య, దేవి సత్యం, ఏఐఎఫ్‌టీయూ నాయకులు పోశమల్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బెల్లంపల్లి, జూలై5 (ఆంధ్రజ్యోతి): 11 ఏళ్లగా దేశంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడి రమేశ్ అన్నారు. శనివారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి ఆధ్వర్యంలో బీజేపీ చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజల అభివృద్ధి కోసమే బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. దేశంలో ఎదురులేని పార్టీగా బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని సూచించారు. ప్రజలందరూ బీజేపీ వైపే ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాచర్ల సంతోష్, శ్రావణ్, అరవింద్, శ్రీనివాస్, ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



శిక్షణలో పాల్గొన్న బీఎల్‌వోలు

తాండూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : 18 ఏళ్లు నిండిన వారందర్ని ఓటరుగా నమోదు చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఓటరు జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేయాలన్నారు. డోర్ టు డోర్ సర్వేలో పకడ్బందీగా నిర్వహించాలని, ఏమైనా తప్పొప్పులు ఉంటే సరి చేయాలన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తహసీల్దార్ జ్యోత్స్న, మాస్టర్ ట్రైనర్స్ హరి ప్రసాద్,రమేష్, నాయబ్ తహసీల్దార్, ఆర్‌ఐలు ఎజాజుద్దీన్, పద్మజ, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

కన్నెపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటామని పేర్కొంటూ ఐకేపీ వీవోఏలు శనివారం ఐకేపీ ఏపీఎంకు సమ్మె నోటీసు అందించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, రూ. 20 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు.

తహసీల్దార్, ఎంపీడీవో బదిలీ

నెన్నెల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నెన్నెల తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డిలు నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇద్దరి ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు శనివారం వెలువడ్డాయి. అధికారులు బదిలీపై వెళ్తున్నప్పటికీ నెన్నెలకు ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రస్తుతం భూభారతి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. తహసీల్దార్‌ను దరఖాస్తుల పరిశీలన ముగిసిన అనంతరం రిలీవ్ చేస్తారని తెలిసింది.

రెండు సంతలతో.. నష్టమే



జాతీయ రహదారిపై ఊత్కూర్ వారసంత

- లక్షెట్టిపేట మున్సిపాలిటీలో ఒకే సంత ఉండాలని డిమాండ్
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

లక్షెట్టిపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలో రెండు సంతలు కాకుండా ఒకే సంత ఉండాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. పేరుకే పట్టణ మున్సిపాలిటీ ఇక్కడ రోజు వారి వ్యాపారం చేసుకునేందుకు కూరగాయల వ్యాపారులకు కనీసం సరైన చోటు కూడా లేదు. ఇక్కడ వ్యాపారాలు కూడా అంతంత మాత్రంగానే సాగుతాయి. చుట్టు పక్కల పల్లెలు ఉండటం వ్యవసాయ ప్రాంతం కావడంతో పల్లెల్లో ఎవరి ఇళ్ల చుట్టు వాళ్లు కూరగాయల మొక్కలు పెట్టు కుంటారు. అంతే కాకుండా కొంత మంది కూరగాయల సాగుచేసి లక్షెట్టిపేట, మంచిర్యాల మార్కెట్‌కు కూడా తీసుకుని వచ్చి అమ్ముకుంటుంటారు. ఇక్కడి పాలకులు, అధికారులు కూరగాయల మార్కెట్‌కు సరైన చోటు ఇవ్వకపోవడంతో రోడ్డుపైనే డేరాలు వేసుకుని కొంత మంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. ప్రతీ రోజు నిర్వహించే కూరగాయల వ్యాపారులకు అటు అధి కారులు సరైన స్థలం చూపకపోవడంతో ఇబ్బంది పడు తున్నారంటే మరోవైపు రెండు వారసంతలు పెట్టడంతో వ్యాపారాలు సాగడం లేదని వాపోతున్నారు.

ఊత్కూర్ సంతతో పొంచి ఉన్న ప్రమాదం...

ప్రతీ గురువారం ఊత్కూర్‌లో నిర్వహించే వార సంతలో ప్రమాదం పొంచి ఉంది. ఈసంతను జాతీయ రహదారిపై పెట్టడంతో నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు మహారాష్ట్ర, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెల్తుంటాయి. భారీ వాహనాలు పెద్దపెద్ద లోడ్‌తో ఇటుగా వెళ్లడం సంత రోజు వేల సంఖ్యలో రోడ్లపైనే జనం ఉండటం రోడ్లకు ఆనుకుని వ్యాపారులు వాళ్ల దుకాణాలను ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అంతుపట్టకుండా ఉంది. చాలా సార్లు వివిధ స్వచ్ఛంద సంఘాలు, రాజకీయ పార్టీలు ఊత్కూర్ సంతను వేరే చోటికి మార్చాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఏవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అందరికీ అందుబాటులో ఉండే విధంగా లక్షెట్టిపేట సంతను కొనసాగించి పూర్వ వైభవం తేవాలని కోరుకుంటున్నారు.

ఒకటే సంత ఉండాలి..

- కట్ల సరేష్, కూరగాయల వ్యాపారి లక్షెట్టిపేట.



లక్షెట్టిపేట చిన్న మున్సిపాలిటీ ఇందులో రెండు సంతలు పెట్టడంతో ఏమాత్రం వ్యాపారాలు సాగడం లేదు. ఇక్కడ ఉన్న జనానికి గతంలో పెట్టిన విధంగా ఒకటే సంత ఉంటే అనుకూలంగా ఉంటది. అప్పటిలా మళ్లీ మా వ్యాపారాలు సాగాలంటే ఇక్కడ ఒకటే సంత ఉండాలి. అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలి.

ఊత్కుర్ సంతతో ప్రమాదమే..

- దొండ ప్రభాకర్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు



జాతీయ రహదారిపై గురువారం ఊత్కూర్ వార సంత పెట్టడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరిగేది ఎవరికీ అర్థం కావడం లేదు. ఇప్పటికే చాలా సార్లు జాతీయరహదారిపై సంతను తీసేయాలని వారసంతకు సరైనచోటును ఏర్పాటు చేయాలని అధికారులకు విన తిపత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి మున్సిపాలిటీలో ఒకేసంత ఉండేలా చూస్తే బాగుంటుంది.

రెండు సంతలు...

లక్షెట్టిపేట మున్సిపాలిటీలో వారంలో రెండు సంతలను అధికారులు ఏర్పాటు చేసారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో లక్షెట్టిపేట, ఊత్కూర్ రెండు వేర్వేరు జీపీలుగా ఉండేవి. రెండు మేజర్ పంచాయతీలు కావడం అందులో ఊత్కూర్ జీపీలో బీట్‌బజార్ ఏరియా మొత్తం వ్యాపార సముదాయాలు ఉండటంతో అప్పటి పాలకులు గురువారం ఊత్కూర్‌లో వారసంత ఏర్పాటు చేసారు. అది చేసిన తర్వాత సుమారు రెండేళ్లు గడవక ముందే లక్షెట్టిపేట జీపీని గత ప్రభుత్వం మున్సిపాలిటీగా ప్రతిపాదించడంతో చుట్టుపక్కల ఉన్న మరోనాలుగు జీపీలను లక్షెట్టిపేట జీపీలో విలీనం చేస్తూ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. ఇదిలా ఉంటే లక్షెట్టిపేటలో 50ఏళ్ల నుంచి ప్రతీ ఆదివారం వార సంత కొనసాగుతోంది.

ఇక్కడి మండలంలోని వ్యాపారులే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి మహా రాష్ట్ర నుంచి కూడా రకరకాల వ్యాపారులు వచ్చి ఇక్కడ సంతలో వ్యాపారం చేసుకుని పోయే వాళ్లు. అప్పట్లో ఒకేసంత ఉన్నప్పుడు వ్యాపారం కూడా బాగానే సాగేది. కానీ రెండు సంతలు ఏర్పటయ్యాక వ్యాపారం నడవడం లేదని వాపోతున్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి



నెన్నెల ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నెన్నెల, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పంజాల సాగర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి, మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజనకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ సరిపడా యూరియా ఉందని అధికారులు చెబుతున్నారే తప్ప డీలర్ల వద్ద నిల్వలు లేవన్నారు. ఒకటి, రెండు లోడ్లు వస్తే యూరియా కోసం రైతులు ఎగబడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైన సీజన్‌కు సరిపడా యూరియా ఇవ్వకపోతే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగతి రామ్‌చందర్, సున్నం రాజు, ప్రతాప్‌రెడ్డి, ఎండీ ఇబ్రాహీం, తిరుపతి, కృష్ణ, గోపాల్, మాజీ సర్పంచులు తిరుపతిగౌడ్, బోయిని మల్లేష్, శంకర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో భువన్ సర్వే



భువన్ సర్వే చేపడుతున్న అధికారులు

బెల్లంపల్లి,జూలై5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటిలోని పెద్దనపల్లి రైల్వే స్టేషన్ ఏరియాలో శనివారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ ఆధ్వర్యంలో భువన్ సర్వే జియో ట్యాగింగ్ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటిలోని అన్ని వార్డుల్లో భువన్ సర్వే జీయో ట్యాగింగ్ పనులను పూర్తి చేశామన్నారు. పూర్తి చేసిన తరువాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. భువన్‌సర్వే ద్వారా ఇంటి యజమానులకు సైతం వారి ఇంటి వివరాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. భువన్ సర్వే చేపట్టిన తరువాత పక్కా ఆస్థిపన్నుల వసూల్లో చర్యలు తీసుకుంటామన్నరు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బందితో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



ధర్మరావుపేటలో మొక్కలు నాటుతున్న పంచాయతీ సిబ్బంది

కాసిపేట, జూలై5 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే పర్యావరణం పరిరక్షణ ఉంటుందని అధికారులు అన్నారు. శనివారం ధర్మరావుపేటలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. మొక్కల పెంపకం వల్ల అడవి విస్తీర్ణం పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు ముత్యాల రాజమౌళి, ఏనుగు జనార్ధన్ రెడ్డి, పంచాయతి కార్యదర్శి అన్నపూర్ణ, తిరుపతి రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

జన్నారం, జూలై5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొండుకూరి ప్రభుదాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాల్లోని జెండాల ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు రవి, దుమ్మల రమేశ్, ఎల్లయ్య, ప్రవీణ్, రాహుల్, రాజన్న, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

దండేపల్లి : జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ, మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామం నుంచి మాదిగ సోదరులు భారీగా తరలివచ్చి వేడుకలను ఘనంగా నిర్వ హించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి లింగపెల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్యలు పిలుపునిచ్చారు. శనివారం దండేపల్లిలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి జిల్లా మానిటరింగ్ జిల్లా సభ్యుడు బచ్చల అంజన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన నవీన్, జిల్లా కార్యదర్శి నరేష్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు బాపన్న, నాయకులు నవీన్, బచ్చలసుబాష్, శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారు ధ్వంసం

మూడు గేదెలు మృతి

హాజీపూర్,జూలై5(ఆంధ్రజ్యోతి): వేంపల్లి మేకల మండి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసంకాగా మూడు గేదెలు మృతి చెందాయి. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన అడ్వకేట్ జైపాల్ రెడ్డి తన టొయోటో క్రూజర్ కారులో రాత్రి తన స్వగ్రామం నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా వేంపల్లి వద్ద మూడు గేదెలు రోడ్డుపైకి రావడంతో వాటిని ఢీకొన్నారు. దీంతో గేదెలు మృతి చెందాయి. కారు పూర్తిగా ధ్వంసమైంది. పోలీసులు గేదెల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రాణహాని కలిగించే విధంగా ప్రవర్తించిన గేదెల యజమాని కార్ల మల్లేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏఈవో వినోద్ కుమార్

భీమిని, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలు చేయించు కున్నట్లయితె అధిక దిగుబడులు సాధించ వచ్చని వ్యవసాయ విస్తీర్ణాధికారి వినోద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించారు. నేషనల్ మిషన్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్(జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం) కార్యక్రమంలో భాగంగా మండలంలో భీమిని గ్రామాన్ని ఎంపిక చేశారన్నారు. దానిలో భాగంగా భీమినిలో రైతుల వ్యవసాయ పొలాల్లో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయడం వల్ల పొలాల్లో ఏరకమైన పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అనేది ముందుగానే తెలసిపోతుందన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి రైతులు వ్యయాన్ని ఆదా చేయ వచ్చని, రైతులు తీసుక వచ్చిన మట్టి నమూనాలను సేకరించి వెంటనే పరీక్షలు చేసి భూసార ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. దీని ద్వారా ఆయా సాగు భూముల్లో ఎంత శాతం ఎరువుల వాడాలనే విషయం రైతులకు అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పుల్లు మేరా, టాకిరే హన్మంతు, ఆదే పోచుమేర, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

భీమిని, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపేట గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు భీమిని పోలీసులు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ వర్షా కాలంలో ఎటూ పనికి వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్న నిరుపేద వృద్ధులకు, రోజు కూలీ చేస్తేనే తినగలిగే వారిని గ్రామంలో గుర్తించి వారికి 15 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేయడం జరిగిందన్నారు. నిరుపేదల ఆకలిని తీర్చాలనే సకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేశామన్నారు. నిరుపేదల ఆకలి తీర్చడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్లు లక్ష్మణ్ చారి, వినోద్ కుమార్, లవన్ కుమార్ స్థానికులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ వడ్డీ చెల్లింపులెప్పుడు..?

(5వ పేజీ తరువాయి)

జిల్లాలోని బెల్లంపల్లి మండలానికి చెందిన ఓ సెకండరీ గ్రేడ్ టీచర్ నూతన గృహ నిర్మాణానికి గత సంవత్సరం ఏప్రిల్ 15న రూ. 5 లక్షల జీపీఎఫ్ రుణం కోసం జిల్లా పరిషత్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఏడాది గడిచినా.. ఆమెకు రుణం మంజూరు కాలేదు. పైగా దరఖాస్తు తిరస్కరించినట్లు సమాచారం కూడా అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

-మంచిర్యాలకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఒకరు తన భార్య అనారోగ్య కారణాల వల్ల జీపీఎఫ్ కోసం గత మార్చిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆయనకు కూడా రుణం మంజూరు కాకపోగా, దరఖాస్తు స్టేటస్ కూడా తెలియకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

అర్హత లేని వైద్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

మందమర్రిరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణపూర్ పట్టణంలో అనుమతులు లేకుండా క్లినిక్‌లు నడుపుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆర్‌ఎంపీ డాక్టర్లకు అడ్డు అదుపు లేకుండా పోతుందని, ఇష్టారీతిన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. శుక్రవారం శ్రీనివాస్ అనే యువకునికి ఆర్‌ఎంపీ ఇంజక్షన్ చేయగా కొంత సేపటికి మృతి చెందాడని ఇది బాధాకరమన్నారు. మృతుడి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం సరైంది కాదన్నారు. అలాగే ఎలాంటి అర్హతలు లేకున్నా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కొంత మంది నాయకులు ఆర్‌ఎంపీకి మద్దతుగా నిలుస్తున్నారని ఇది హేయమైందన్నారు. వెంటనే మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వచ్చీ రాని వైద్యం చేస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నారని ఇది ఎంతో ప్రమాదకరమన్నారు. అంతో ఇంతో చదువుకుని ప్రాక్టీస్ చేసిన వారు కాకుండా ఎలాంటి అర్హత లేని వాళ్లు వైద్యం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, లింగయ్య, వెంకటస్వామి, సాంబయ్య, పోలు, గోపి, చందర్, మొండి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో అధ్యక్షుడిగా శ్రీనివాస్



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న టీఎన్‌జీవో నాయకులు

లక్షెట్టిపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట యూనిట్ టీఎన్‌జీవో అధ్యక్షుడిగా దండేపల్లి మండలం వెల్గనూర్ పంచాయతీ కార్యదర్శి గోళ్ల శ్రీనివాస్‌ను, ఈసీ మెంబర్‌గా రాజగోపాల్‌ను ఎన్నుకున్నారు. శనివారం లక్షెట్టిపేట పట్టణంలోని విశ్రాంతి భవనం టీఎన్‌జీవో సమావేశంలో ఆయకు పదవి అప్పగించారు. ఈసందర్భంగా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇటీవల గుండెపోటుతో గతంలో ఉన్న అధ్యక్షుడు చంద్రమౌళి మరణించారని ఆయన మృతి సంఘానికి తీరని లోటు అన్నారు. అదే విధంగా నూతన అధ్యకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించిన జిల్లా అధ్యక్షుడితో పాటు ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉద్యోగుల సమస్యలపై స్పందించి అందరి సహాయ సహకారాలతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడితో పాటు ఈసీ మెంబర్‌ను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి నరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావన్‌కుమార్, జిల్లా ఈసీ మెంబర్ కుమార్, యూనిట్ సెక్రటరీ శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, గవ్వల కళ్యాణ్ మాలిక్, సతీష్, శ్రీహరి, నాగరాజు, మధు, సత్యనారాయణ, రాజశేఖర్, సంజీవరాణి, సుజాత, వెంకటేష్, సునిత రాణి సద్గుణ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

కోటపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బాసరలోని ఆర్‌జీయుకేటీ (ట్రిపుల్ ఐటీ)కి కోటపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినీ పూరెళ్ల అంజలిదేవి ఎంపికైంది. పదవ తరగతిలో 568 మార్కులతో టాపర్‌గా నిలిచిన అంజలిదేవి ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన ఫలితాల్లో విద్యార్థిని ఎంపికైంది. ఎంపికైన విద్యార్థిని అంజలిదేవిని పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

దండేపల్లి: దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన మ్యాన అక్షయ అనే విద్యార్థి బాసర ట్రిపుల్ ఐటికి ఎంపిక య్యారు. వెల్గనూర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన అక్షయ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 571 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి వెల్లడించారు. బాసర ట్రిపుల్ ఐటి పరీక్ష రాయగా విడులైన ఫలితాలల్లో అక్షయ ప్రతిభ కనబర్చి సీటు సాధించింది. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు విద్యార్థిని అభినందించారు.

తాండూర్ : తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పుప్పాల పూజిత, సముద్రాల జశ్వంత్‌లు బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తెలిపారు. విద్యార్థులను తహసీల్దార్ జోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు అభినందించారు.

జన్నారం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాసర ట్రిబుల్ ఐటీకి 12 మంది ఎంపికైనట్లు ఎంఈవో విజయ్ కుమార్ తెలిపారు కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి ఆరుగురు రాథోడ్ యోగేశ్వర్, ఏల్పుల నరేందర్, కొత్త అనిల్, మూగల హారిక, కామెర హారిక, పెరుగు అక్షర, చింతగూడ పాఠశాల నుంచి గంగాభవాని, లకావత్ దీపిక, ఇంధన్ పల్లి నుంచి మోటూరి సంజన, ప్రభుత్వ బాలికల పాఠశాల నుంచి శ్రీనిధి, కలమడుగు పాఠశాల నుంచి షేక్ అశ్పక్, అనుమాండ్ల సాయిశ్రీకర్ ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు దాముక కమలాకర్, కట్ట రాజమౌళితో పాటు అభినందించారు.

మందమర్రిరూరల్ : మందమర్రి మండలంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ సారా తస్నీం శనివారం తెలిపారు. సీహెచ్ సిరి, అఫ్రీన్, సఫ్రీన్, సోఫియా ప్రేరణ, అశ్వికతేజ్‌లు సీట్లు సాధించినట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 30 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా వీరిలో ఐదుగురు విద్యార్థులు మోడల్ స్కూల్‌కు చెందిన వారు ఉండడం విశేషమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి. మహిమ బాసర ఐఐటీలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం రాథోడ్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో ఐఐటీలో తన ప్రతిభ చూపి సీటు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మహిమను హెచ్ ఎం రాథోడ్ రమేశ్ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ సభ్యులు అభినందించారు.

ప్రభంజనంకు పీడీఎస్‌యూతో సంబంధం లేదు

లక్షెట్టిపేట, జులై 5(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం తదితర మండలాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల్లో తిరుగుతూ అవినీతికి పాల్పడుతున్న ప్రభంజనం అనే వ్యక్తికి పీడీఎస్‌యూకి ఎలాంటి సంబంధం లేదని ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ.శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా వసతిగృహాలు, విద్యా సంస్థల్లో తిరుగుతూ అవినీతికి పాల్పడుతూ అక్రమ వసూళ్లు చేస్తున్న ప్రభంజనంకు ఎవరూ భయపడకూడదన్నారు. అతడికి ఎవరూ డబ్బులు ఇవ్వకూడదన్నారు. ఇప్పటికే అతడిపై కొంతమంది వార్డెన్లు లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఈసమావేశంలో శ్రీకాంత్ వెంట జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ఉపాధ్యక్షుడు సికిందర్, నాయకులు మనోహర్, కార్తీక్ ఉన్నారు.



కాలేజీల అభివృద్ధికి నిధులు

- జూనియర్ కళాశాలల్లో మెరుగుపడనున్న వసతులు
- మరమ్మతులు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు
- జిల్లాకు రూ. 1.63 కోట్లు మంజూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యల ను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి రూ. 1.63 కోట్లు మంజూరయ్యాయి.

బెజ్జూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు జూన్ 1 నుంచి ప్రారంభమయ్యాయి. నిధులు లేక ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. భవనాల పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. శుద్ధజలం, విద్యుత్తు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రిన్సిపాళ్లు సొంతంగా చేతినుంచి డబ్బులు ఖర్చు చేస్తున్నారు. గత పదేళ్ల నుంచి కళాశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయని కారణంగా కళాశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈక్రమంలో చాలా రోజుల తర్వాత జిల్లాలోని 11జూనియర్ కళాశాలలకు మౌలిక వసతుల కోసం నిధులు మంజూరయ్యాయి. గతంలో ఎస్ఆర్‌డీపీ ద్వారా ప్రతి ఏటా నిధులు వచ్చేవి. పదేళ్లుగా నిధులు రావడం నిలిచిపోయింది. మూడు నెలల క్రితం జూనియర్ కళాశాలల పరిస్థితి, అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలపై ప్రభుత్వం కోరింది. దాని ప్రకారం పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఎట్టకేలకుజూనియర్ కళాశాలల్లో వివిధ రకాల పనులు చేపట్టేందుకురూ.1.63కోట్ల నిధులుమంజూరు చేసింది.

● తరగతి గదులకు..

కళాశాలలకు మంజూరైన నిధులతో తరగతి గదుల మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో పాటు పారిశుధ్య పనులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్‌కు సంబంధించిన పనులు, త్రాగునీరు, గ్రీన్‌చాక్ బోర్డు, డ్యూయల్ డెస్కులు, భవనాలకు రంగులు వంటి పనులు చేయనున్నారు. గతంలో కొన్నిచోట్ల అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు కూడా పూర్తికానున్నాయి. దీంతో కొంతలో కొన్ని సమస్యలు తీరనున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఏ మాత్రం సరిపోకపోయినా కొంత మేర సౌకర్యాలు కలిగే అవకాశాలు ఉన్నాయి. కానీప్రభుత్వం కళాశాలల మరమమ్మతులకు నిధులిచ్చినా నిర్వహణ నిధులు మంజూరు చేయలేదు. సుద్ద ముక్కలు, స్టేషనరీ, రిజిస్టర్లు, జెండా వేడుకలు, ఇతర సమావేశాల ఖర్చులు, పారిశుధ్య నిర్వహణ, హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ తదితర అవకాశాలకు ఒక్కో కళాశాలకు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు అవుతోంది. దీంతో నిర్వహణ నిధులు అందించాలని అధ్యాపకులు కోరుతున్నారు. మరమ్మత్తులకు నిధులు మంజూరుతో పాటు కళాశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తే బాగుంటుందని అధ్యాపకులు భావిస్తున్నారు.

● కేటాయించిన నిధులు ఇలా..

జిల్లాలోని 11ప్రభుత్వ కళాశాలల్లో మరమ్మత్తుల కోసం రూ.1.63కోట్లు నిధులు మంజూరు చేసింది. కళాశాలల వారీగా కాగజ్‌నగర్‌కు రూ.28.20లక్షలు, సిర్పూర్(టి)కి రూ.10.60, జైనూర్‌కు రూ.15.70, కౌటాలకు రూ.20.00, బెజ్జూరుకు రూ.12.60, తిర్యాణికి, 16.80, దహెగాంకు రూ.03.70, ఆసిఫాబాద్‌కు రూ.15.40, కెరమెరికి రూ. 25.50, వాంకిడికి రూ.03.70, రెబ్బెనకు రూ.11.60లక్షలు నిధులు మంజూరయ్యాయి.

కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు..

- కళ్యాణి, జిల్లా మాధ్యమిక విద్యాధికారి



కళాశాలలకు మంజూరైన నిధులను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పనులు చేయిస్తాం. కళాశాలల మరమమ్మతులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం.

బెజ్జూరు ఎస్సైగా సర్తాజ్‌పాషా

బెజ్జూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు ఎస్సైగా సర్తాజ్ పాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ప్రవీణ్‌కుమార్ బదిలీపై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు వెళ్లగా 2024 బ్యాచ్‌కు చెందిన సర్తాజ్ పాషా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రజల సహకారంతో శాంతిభద్రత పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఎంపీడీవో బదిలీ

సిర్పూర్(టి), జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) ఎంపీడీవో సత్యనారాయణ మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. శనివారం ఈ మేరకు కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

విద్యార్థులకు అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో శనివారం ప్రిన్సిపాల్ మహేశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలకు చెందిన గుండేటి వర్షిత్, ఉమెజానాజ్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకు చర్యల తీసుకుంటున్నామని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని వారు అర్హులని, విద్యార్థులు సోమవారంలోగా ధ్రువీకరణ ప త్రాలు అందజేయాలని సూచించారు.

రైతులకు సరిపడా యూరియా అందజేయాలి



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

వాంకిడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా యూరియా సరిపడా అందజేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల పంపిణీ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎరువుల పంపిణీలో అధికారులు జాప్యం చేయకుండా సరిపడా ఎరువులు ఇచ్చే విధంగా చూడాలన్నారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలని కార్యదర్శి ఓమాజీని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి పథకాలపై తహసీల్దార్ కవితను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు అందించి ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ మిలింద్‌కుమార్ ఉన్నారు.

జీవో 49ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జీవో 49ని వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆదివాసీ భవనంలో శనివారం జీవో 49ని రద్దు చేయాలని ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొని ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఆదివారం నుంచి ఈ నెల 13 వరకు ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించనున్నామని చెప్పారు. 14న ప్రతి మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎఫ్ఆర్వో కార్యాలయాల ఎదుట తీర్మాన ప్రతులు అందజేస్తామని తెలిపారు. 21న ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో, జిల్లా కేంద్రంలో సంపూర్ణ బంద్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 28న ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద మహా ధర్నా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించామని తెలిపారు. సమావేశంలో నాయకులు కోట్నాక విజయ్‌కుమార్, మడావి శ్రీనివాస్, కోవ విజయ్, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కాగజ్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కాగజ్‌నగర్/బెజ్జూరు/సిర్పూర్(టి)/కౌటాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కార్యకర్తలు, నాయకులు శనివారం హరీష్‌బా బు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్, మండల అధ్యక్షుడు అశోక్, సిందం శ్రీనివాస్, దళిత మోర్చా అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జూరులో హరీష్‌బాబు జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, నీలేష్, తిరుపతి, ప్రవీణ్, తిరుపతి, బాలు, రాకేష్, శ్యాం, సాయి, సంతోష్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు. సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండ లాధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు. కౌటాలలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌గౌడ్, విజయ్, వి నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఏస్పీ చిత్తరంజన్

రెబ్బెన, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. గోలేటిలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టుమిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వసుధ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం వసుధ స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు ఉమా మాట్లాడుతూ మహిళలకు టైలరింగ్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించి వారికి ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జోన్ ఏఎస్పీ అచ్చేశ్వర్ రావు, సొల్లు లక్ష్మి, ఎస్సై చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేత



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సైలు

ఆసిఫాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నియామకమైన బెజ్జూరు, పెంచికలపేట ఎస్సైలు శనివారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బెజ్జూరు ఎస్సైగా ఎండీ సర్తజ్‌పాషా, పెంచికలపేట ఎస్సైగా ఎం అనీల్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు వారు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలువడంతో ఆయన పలు సూచనలు చేశారు.

పనులు వేగవంతం చేయాలి




పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన మహిళా శక్తి భవన్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు.జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా మహిళా శక్తి భవనం పనులను శనివారం పంచాయతీ రాజ్ ఈఈ అజ్మీర కృష్ణతో కలిసి కలెక్టర్ పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. రూ.5 కోట్ల ప్రత్యేక నిధులతో భవన పనులను ప్రారంభించామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అక్టోబరు నెల చివరి వారంలోగా పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పను లలో నాణ్యత ఉండేలా ఇంజ నీరింగ్ అధికారులు పర్యవేక్షిం చాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల ఆర్ఆర్ కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. పనులు వేగంతం చేయాలని, బేసిమెంట్ వరకు పూర్తి చేసుకున్న వారి వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దీంతో ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అవుతా యని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గజా నంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణ బురదమయం

పెంచికలపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలో బురద పేరుకుపోవడంతో పిల్లల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి మండలంలోని కొండపల్లి గ్రామంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు బురదలో నుంచి నడుచుకుంటూ ఇళ్లకు చేరాల్సిన దుస్థితి నెలకొంది. బురదనీటిలో దోమలు వృద్ధి చెంది పిల్లలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన పాఠశాల ఆవరణ

కూలీల ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

వాంకిడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల ఫిర్యాదు కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800-200-1001ను గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఉపాధి హామీ జాబ్‌కార్డులు 89 వేలు ఉన్నాయి. కూలీలు మొత్తం 1.65 లక్షల మంది ఉన్నారు. ఇందులో పనిచేసిన కూలీలు 1.37 లక్షల మంది ఉన్నారు. మహిళలు 72,610, పురుషులు 64,390 మంది ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం కూలీ రూ. 250 నుంచి రూ. 307 పెంచింది. దీంతో కూలీల రాకపెరిగింది. ప్రతి పంచాయతీకి 150 మంది కూలీలు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే పని చేసే ప్రదేశంలో సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చు. దాని పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారు. జాబ్‌కార్డు జారీ చేయకున్నా.. పనిచేసే చోట వసతులు కల్పించకున్నా.. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకున్నా. ట్రోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇది 24 గంటలపాటు పనిచేస్తుంది. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసిన తర్వాత అధికారులు పూర్తి వివరాలు సేకరించడంతో పాటు రికార్డు చేస్తారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఈ నంబరు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

వాంకిడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన బోధన చేయానలి సూచించారు. కార్యక్ర మంలో హెచ్ఎం నారాయణమూర్తి, ఎస్‌సీ ఆర్పీ రాజేశ్వర్, పాల్గొన్నారు.

జమకాని వంట గ్యాస్ రాయితీ

● లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు



జైనూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వంట గ్యాస్ రాయితీ డబ్బులు జమ కావడం లేదు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో కొన్నేళ్లుగా వంట గ్యాస్ సిలిండర్ల భారం మోయలేనంత గా మారింది. దీంతో సామాన్యు లకు ఊరట కలిగించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ రూ. 500లకే సిలిండర్ ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించింది. అధికారంలోకి రాగానే గత ఏడాది ఫిబ్రవరి నుంచి మహాలక్ష్మి పథకంలో భాగంగా రాయితీ రూపంలో రూ. 500లకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నారు. ఇంత వరకు బాగున్నా.. మూడు నెలల నుంచి అర్హులకు గ్యాస్ రాయితీ రావడం లేదని చెబుతున్నారు. దీంతో ఆర్థిక భారం భారం తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 12 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో సుమారు 1.80 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నిత్యం సుమారు మూడు వేల గ్యాస్ సిలిండర్లు అవసరం అవుతుండగా పూర్తి ధర చెల్లిస్తున్నారు. ఆ తర్వాత మళ్లీ మహాలక్ష్మి పథకం ద్వారా రు. 500లకు ఆదనంగా చెల్లించిన పైసలు రాయితీ రూపంలో లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు. కానీ సిలిండర్ తీసుకుని నెల రెండు నెలలు గడుస్తున్నప్పటికీ లబ్ధిదారుల ఖాతాలో రాయితీ డబ్బులు జమ కావడం లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వినియోగదారుల నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో అవక తవకలు జరుగుతున్నాయా..?లేక ప్రభుత్వ నుంచి రాయితీ జమకావడం లేదా..? అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. రాయితీల కోసం ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసరకుల ధరలతో ఇబ్బందులు పడుతున్నామని, గ్యాస్ రాయితీ సక్రమంగా అందేలా చూడాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

రాయితీ డబ్బులు రావడం లేదు..



సిలిండర్ తీసుకున్నా పూర్తి స్థాయిలో రాయితీ డబ్బులు రావడం లేదు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాయితీ డబ్బులు పడడం లేదు. కేవలం 57 రూపాయల రాయితీ మాత్రమే వస్తుంది. ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలి.

- రంజనాబాయి, కాలేజీగూడ

ఏడాదిగా జమ కావడం లేదు..



ఏడాది కాలంగా రాయితీ డబ్బులు జమ కావడం లేదు. పూర్తి డబ్బులు చెల్లించి వంట గ్యాస్ కొనుగోలు చేస్తున్నాం. గ్యాస్ తీసుకున్న ప్రతి సారి రాయతీ డబ్బులు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నాం. బ్యాంక్, గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఆరా తీస్తున్నా ఎవరు సరైన సమాధానం చెప్పడం లేదు.

- విమలాబాయి, పవర్‌గూడ

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం



ఎస్సై కొమురయ్యను సన్మానిస్తున్న నాయకులు, యువకులు

పెంచికలపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండేళ్ల పాటు పని చేసి బదిలీపై ఆసిఫాబాద్ ఎస్పీ కార్యాలయానికి వెళ్తున్న ఎస్సై కొమురయ్యను శనివారం పలువురు నాయకులు, యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగు లకు బదిలీలు సర్వసాధారణమన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు, పోలీసు సిబ్బంది సహకారం మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, చంద్రమౌళి, సంజీవ్, సుధాకర్, తిరుపతి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు. నూతనంగా వచ్చిన ఎస్సై అనీల్‌కుమార్‌కు స్వాగతం పలికారు.

శానిటేషన్ ఇన్స్‌పెక్టర్‌కు..

ఆసిఫాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ గజానంద్ దెబ్బటి రాజును శానిటేషన్ ఇన్స్‌పెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించిన నేపథ్యంలో కార్మికులు శనివారం ఆయనను సన్మానించా రు. గతంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసి అనంతరం వార్డు అధికారిగా బాధ్యతలు చేపట్టిన దెబ్బటి రాజును కమిషనర్ తిరిగి అదే పోస్టులో నియమించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, సమ్మయ్య, శంకర్, శ్రావణ్, నాగరాజు, కార్తీక్, అను, అశోక్, శ్రీనివాస్, గణేష్, సాగర్, నారాయణ, జగ్గారావు, శంకర్, సంధ్య, పద్మ, లక్ష్మి, మల్లేష్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.